# 'నాదే తప్పు'

[కథానిక]

## 'అమరేంద్ర'

అప్పటి జానకిరామయ్యని గుర్తుకు తెచ్చుకుంటే ఎంత రాతిగుండె అయినా కరిగిపోతుంది. అవి అతని భార్య జానకి పోయిన కొత్తరోజులు. అప్పుడు నిజంగా అతను లోకంలో వున్న విషాదానికంతకీ మూర్తీభావంగా కనిపించేవాడు. అతనితో క్షణంసేపు మాట్లాడితే చాలు, ఇతరులకూడా అతని నిస్పృహలో సగం తల కెక్కేది. ఆ రోజుల్లో అతని శోకం, అతని నిరాశా అంటువ్యాధిలాగా అతనిదగ్గరికి వచ్చినవాళ్లందరికీ అంటుకునేది. ఇందులో లేశంకూడా అతిశయోక్తి లేదని నా అనుభవంమీద చెబుతున్నాను.

ఒకరోజున పరామర్శచేద్దామని వెళ్లిన నేను పుట్టెడు బరువుతో ఇంటికి తిరిగివచ్చాను. టైఫాయిడ్‌తో తన భార్య మంచంపట్టింది మొదలు, ప్రాణం వొదిలేదాకా జరిగిన సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెబుతుంటే నామనస్సు కరిగిపోయింది. నిజంగా జానకిరామయ్య ఎంత ఆదర్శప్రాయమైన భర్త! ఇటువంటి మగవాళ్లు ఈ కలికాలంలో ఎందరు దొరుకుతారు? ఇంకో మగవాడైతే మొదటి పెళ్లాం అంత్యక్రియలు ముగిసీముగియకమునుపే రెండో పెళ్లికోసం తహతహలాడేవాడు. కాని జానకిరామయ్యమాత్రం అటువంటి నీచజాతికి చెందడు. అతని భార్య జానకి పోతూపోతూ నాలుగేళ్ల లలితనీ, రెండేళ్ల రామూన్నీ భర్తచేతుల్లో వొదిలి వెళ్లింది. "ఇంక వీళ్లకి మీరే తల్లీ తండ్రీ" అన్నదిట. ఆ మాటలు చెబుతుంటే జానకిరామయ్యకళ్లలోంచి జడివానలాగా కన్నీరు రాలింది. అప్రయత్నంగా నా కళ్లుకూడా తడిసిపోయినై. అవును. ఇకనుంచీ తండ్రిఅయినా అతనే, తల్లి అయినా అతనే. వాళ్లిద్దరినీ పెంచి పెద్దవాళ్లని చేసి చదువుసంధ్యలు చెప్పించి ఒక ఇంటివాళ్లని చేసేదాకా జానకిరామయ్యకి జీవితంలో ఇంకో ఆలోచనకి తావులేదు. అహర్నిశలూ పిల్లల యోగక్షేమాలని కనుక్కుంటూ కంటికి రెప్పగా సాకుతూ కాలం గడపడంకంటె అతని కింకేం కావాలి? ఈమాటలే అతని నోటివెంట వింటుంటే జలదరించిపోయాను. జీవితంలో ఒక ప్రస్ఫుటమైన ఆదర్శాన్ని ఏర్పరచుకుని దాని కోసం బతుకంతా నివేదించటానికి సంసిద్ధంగా వున్న తపస్విలాగా నాకు కనిపించాడు. వజ్రసంకల్పం, దృఢనిశ్చయం అతని కంఠంలో నాకు వినిపించినై. మాసిన గడ్డంతో, రేగిన జుట్టుతో, దుమ్ముకొట్టుకున్న గుడ్డలతో దీనంగా నాముందు కూచున్న జానకిరామయ్య కేసి చూస్తుంటే, అతని మాటలు వింటుంటే నాకడుపు చెఱువైపోతోంది.

అంతటితో ఊరుకోకుండా, అవసానదశలో తన భార్యచేతిలో చెయ్యి వేసి "జానకీ, పిల్లలవిషయంలో నువ్వేమీ దిగులు పెట్టుకోకు. వాళ్లని సాకటంకంటే నా కింకేం కావాలి? నే నీ జన్మలో ఇక పెళ్లిమాట తలపెట్టను" అని మాటఇచ్చాడుట. భార్య ఏదో అనబోయిందిటకాని మాట పెగిలిరాలేదుట. ఇంతలో మృత్యువు ముంచుకొచ్చిందట!

ఈ శపథంసంగతి వింటుంటే నా మనస్సు ఆశ్చర్యంతో నిండిపోయింది. కథల్లోగాని కనిపించని పాత్రలు వాస్తవజీవితంలోకూడా మనకి ఎదురుపడతయ్యేమో ననిపించింది. ఎన్నాళ్లకిందటో చూసిన డాక్టర్‌చిత్రం మళ్ళీ ఒక్కసారి మొదటినుంచి చివరిదాకా మనసులో మెదిలింది. చూస్తుండగా జీవితంలోని కష్టానుభవాలవల్ల మా జానకిరామయ్యకూడా ఒక్కసార మారిపోతాడేమో ననిపిం

చింది. డాక్టర్ ఫిలింలోని కథానాయకుడితో పోటీ చెయ్యగలిగిన త్యాగం, దీక్షా మా జానకిరామయ్యలోనూ పెంపొంది అతనుకూడా ఒక ఆదర్శపురుషుడుగా తయారవుతాడనీ, నాకంటే గొప్ప కథకులెందరో అతని జీవితాన్ని వస్తువుగా స్వీకరించి రచనలు సాగించే అవకాశం వస్తుందనీ ఎంతో ఉబ్బొంగిపోయాను.

అవసానకాలంలో ఇచ్చిన మాట అవసరాన్నిబట్టి జారవిడిచేది కాదని నా గట్టి నమ్మకం. అందులో జానకిరామయ్యలాంటి ఆదర్శభర్త అటువంటి నీచమైన పనికి పూనుకోడని నా దృఢనిశ్చయం. నాకు అంత గట్టి నమ్మకం కలగటానికి మరొక ప్రబలమైన కారణం వుంది. అప్పటికే జానకిరామయ్య నలభయ్యోపడిలో పడ్డాడు.

ఇంటికి వెళ్ళడానికి లేస్తూ "వెళ్ళొస్తాను బాబూ" అన్నాను. "మంచిది నాయనా. ఈ దీనుణ్ణి పూర్తిగా మరచిపోకు. కాస్త అప్పుడప్పుడూ వొచ్చి చూసి పోతూవుండు" అన్నాడు.

## ౨

జానకిరామయ్య జానకిని కోల్పోయిన దుఃఖాతిశేకంతో నా వొక్కడితోనూ ఇల్లా మాట్లాడాడేమో ననుకున్నాను. కొన్నాళ్ళకి ఆయన్ని కలుసుకున్న ప్రతివాళ్ళతోనూ ఇవే మాటలు అన్నాడని విని లోపల చాలా సంతోషించాను. ఈ మాదిరిగానే సాధారణ మానవులు పరిస్థితుల ప్రభావంవల్ల మహాపురుషులుగా పరిణతి పొందుతా రని అనుకున్నాను.

క్రమేపీ నా అభిప్రాయంలో జానకిరామయ్య హీరో అయిపోతున్నాడు. వూళ్లో ఆయనమనోనిగ్రహాన్నిగురించిన వార్త లెన్నో వ్యాపిస్తున్నయ్. తనకి పిల్ల నిస్తా మని వచ్చిన పెద్దమనుషు లెందరినో చిన్నబుచ్చి ఇంటికి దారిపట్టించాడుట. ఊళ్లోని అమ్మలక్కలంతా అదే పనిగా ఇంటిచుట్టూ తిరుగుతూ "నాయనా, నువ్వొక ఇంటివాడివి అయితే కాని మాకు మనసు కుదుటపడదు. నీకేం, వడివయసులోమనిషివి! నాలుగు కాలాలపాటు సుఖపడాల్సినవాడివి. నువ్వు కోరిన సంబంధం తీసుకొస్తాం. ముక్కాకలూ తీరిన ముసలి రామయ్యే మూడో పెళ్లికి తగుదునమ్మా అని తయారైతే మూడేళ్ల పడుచువాడివి నీకేం నాయనా? నువ్వు ఊఁ అంటే చాలు, నీకాళ్ళముందుకే సంబంధాలు వచ్చి పడతై" అంటూ ఒత్తిడిచెయ్యటం మొదలుపెట్టారు. జానకిరామయ్య నిబ్బరంగా వీళ్ళందరి ఒత్తిడికీ తట్టుకుని వీసమైనా సడలని నిశ్చయంతో "రెండో పెళ్లి మాట నా చెవిని పడకూడదు. ఆ మాట ఎత్తేవాళ్లు నా గడప తొక్కొద్దు" అని ఖచ్చితంగా చెప్పాడట. ఈ మాటలకే నొచ్చుకున్న అమ్మలక్కలను అంతటితో విడిచిపెట్టక "జానకిప్రాణంమీదికి వొచ్చి ఇంట్లో ఒంటరిగాణ్ణి నానాయాతనా పడుతుంటే ఒక్కళ్లయినా గడపలోకి వచ్చిన పాపాన పోయారూ? అటువంటివాళ్లు చుట్టరికాలు తిరగేసుకుంటూ ఇవాళ ఏముఖంపెట్టుకుని నాఇంటి కొచ్చారు?"అని ముఖాన్నే అడిగేసరికి ఒక్కరి ముఖానా కత్తివేసినా నెత్తురు చుక్క లేదుట. చెంపలు వేసుకుంటూ చుట్టాలు కాలి కొద్దీ దూసుకున్నారట.

ఒకరోజున నేను పొద్దున్నే జానకిరామయ్యగారింటికి వెళ్లి అద్భుతమైన ఆ దృశ్యాన్ని చూసి పులకించిపోయాను. భార్యఫోటో ఒకటి ఎన్లార్జిచేయించి గదిలో పెట్టారు. ప్రొద్దున్నే తోటలో పూసిన పూలన్నీ కోసుకొచ్చి దండ గుచ్చి పిల్లలూ, ఆయనా ఫోటోని అలంకరిస్తున్నారు. ఆ దృశ్యం చూసి ముగ్ధణ్ణయిపోయి ఎంతోసేపు మౌనంగా నిలబడిపోయాను. జననమరణాల అవధిని దాటిన పవిత్రప్రేమని జానకిరామయ్యగారిలో చూస్తున్నా ననిపించింది. ప్రేమపూరితమైన ఆయనహృదయంలో, భార్య మరణించినా చిరంజీవిగా వుండిపోగలదని తలపోశాను.

నిజంగా కష్టానుభవాలవల్లనే మనిషిలో అంతవరకూ మరుగుపడివున్న ఉదాత్తగుణాలు ఒక్కసారిగా కళ్లని మిరుమిట్లు గొలుపుతూ ప్రకాశిస్తయ్. ఆ నిమిషంలో నేను చూచిన జానకిరామయ్యకీ, చిన్నప్పటినుంచీ నేను ఎరుగున్న జానకిరామయ్యకీ పోలికే లేదు!

"బాబుగారూ! శలవుతీసుకుంటాను" అన్నాను.

"మంచిది. మళ్ళీ ఎన్నాళ్లకి కనిపిస్తావోగదా?" అన్నాడు.

"ఏమో, చెప్పలేనండి. ఇవాళే ఊరికి వెళ్తున్నాను. నన్ను ఎక్కడో దూరపుచోటికి బదిలీచేస్తారని తెలిసింది" అన్నాను.

"నువ్వు ఎక్కడున్నాసరే, కాస్త నీ యోగక్షేమాలు రాస్తూవుండు నాయనా" అన్నాడు.

"వంటమనిషిని పెట్టారా?" అన్నాను.

"లేదోయ్. పెట్టదలుచుకోలేదు. నేనే పిల్లలకి వొండిపెట్టా లనుకుంటాను. నా చేత్తో వొండిపెడితే కాని వాళ్లు కడుపునిండా తినరు; నాకు తృప్తిగానూ వుండదు." అని బదులుచెప్పటం వినేసరికి నాకు మేరలేని ఆశ్చర్యం వేసింది.

"నిజంగా తండ్రి అంటే అల్లా వుండాలి ! నిజమైన భర్త అంటే అల్లా వుండాలి !" అని మాటిమాటికీ మనసులో జానకిరామయ్యగారిని కొనియాడుతూ శెలవుపుచ్చుకున్నాను.

ఆ రోజే ఆ వూరు వదిలి వెళ్లిపోయాను.

### 3

ఆ వూరు వదిలి వెళ్లాక జానకిరామయ్యగారిని గురించిన సంగతు లేమీ నాకు తెలియలేదు. ఉత్తరం రాస్తానని ఎందరికో మాట ఇచ్చాను. ఆ మాట అందరి విషయంలో లాగే ఆయనవిషయంలోకూడా నీటి మూట అయిపోయింది. చాలా విషయాల్లో మనిషి మనస్సుకంటే బద్ధకానికే ఎక్కువ బలం వుంది !

ఏవేవో పనులమీద ఎన్నెన్నో ఊళ్లు తిరిగాను. కాని మళ్లీ ఆవూరు వెళ్లటం పడలేదు. జానకిరామయ్యగారిని మాత్రం ఎప్పుడూ మనసులో తలుచుకుంటూనే వుంటాను. ఆయనపిల్లలు పెద్దవాళ్లయి వుంటారు. ఆయనభారం తీరే రోజు ఆనాటికానాడు దగ్గరకి వస్తూ వుంటుంది. తన బిడ్డల సుఖంకోసం తన సుఖాన్ని తృణప్రాయంగా తోసిపారేసిన తండ్రి త్యాగాన్ని ఎన్నిసార్లో మనసులో కొనియాడుతూ వుంటాను.

ఆరేళ్లతరవాత మొన్న నొకసారి అవసరమైన పనిమీద జానకిరామయ్యగారి వూరు వెళ్లాల్సొచ్చింది. ఒంటరిగాడు కదా, ఆయనఇంట్లో దిగి ఇబ్బంది పెట్టటం ఎందుకని ఆ వూళ్లో వున్న దూరపు చుట్టాలింట్లో దిగాను. నా పని చూసుకుని తీరుబాటుగా వున్న సమయంలో ఒకసారి చూసివొద్దామని జానకిరామయ్యగారింటికి బయలుదేరాను.

వాకిట్లో అడుగుపెట్టేసరికి నా కళ్లని నేను నమ్మలేకపోయాను. ఇదివరకు పాతకాలపు పెంకుటిల్లు వుండే చోట చక్కటి సిమెంట్ కాంక్రీట్ మేడ వెలిసింది. ఇంటిచుట్టూ చెట్లూ, పశువులూ, మనుషులూ ఇల్లంతా కలకలలాడుతోంది. ఆరేళ్లకిందట నేను చూసిన పరిసరంలో కనిపించిన విషాదానికీ ఈనాటి కలకలానికీ ఎక్కడా పోలిక లేదు. పొరబాటున ఇంకెవరి ఇంట్లోనైనా అడుగు పెట్టానేమోనని వెనక్కి తిరగబోతున్నాను. నన్ను దూరంనుంచే ఎవరో ఇద్దరు పిల్లలు చూసి ఇంట్లోకి పరిగెత్తారు. వాళ్లు లలితా, రామదానూ కావచ్చు ననుకున్నాను. ఒక్క నిమిషంలో ఇంట్లోంచి వాళ్లు తమతో ఒక పద్దెనిమిదేళ్ల స్త్రీని వెంటపెట్టుకొచ్చి, ఆమెకి నన్ను చూపించారు. ఆ స్త్రీ క్షణంసేపు కళ్లు తిప్పుతూ నాకేసి చూసి మెరుపులాగా మళ్లీ లోపలికి వెళ్లిపోయింది. జానకిరామయ్యగా రున్నారా అని అడుగుదా మనుకుంటుంటేనే పిల్లలుకూడా లోపలికి వెళ్లిపోయారు. తిరుగుముఖం పడుతుంటే వెనకనుంచి "ఎవరూ ?" అని పిలవటం వినబడింది. ఆ పరిచితమైన స్వరం జానకిరామయ్యగారి దని పోల్చుకుని ధైర్యం తెచ్చుకుని "నేనేనండీ, మరిచిపోయారా ?" అన్నాను.

"రా, లోపలికి రా. ఇదేనా రావటం ? ఎన్నేళ్లయిందీ ? పద, లోపలికి పదా" అని చెయ్యి పుచ్చుకుని ఇంట్లోకి తీసికెళ్లారు.

జానకిరామయ్యగారిని నేను వెంటనే గుర్తుపట్టలేకపోవటానికి ఆయనవేషమే కారణము. సన్నటి గ్లాస్గోపంచా, నిగనిగలాడే సిల్కులాల్చీ, గజందూరనుంచే ఘుమాయించే తలనూనె, ఆయనరూపానికి విశిష్టతను తెచ్చిపెట్టిన రోల్డుగోల్డుఫ్రేంకళ్ళజోడూ చూసి నేను బిత్తరపోయాను. ఇప్పు డాయనముఖంలో ఒక్క విషాదమేఘంకూడా పొడగట్టటం లేదు. ఏదో అసాధారణమైన మార్పు ఆయనజీవితంలో వచ్చి వుంటుం దని ఊహించసాగాను. మనస్సు ఎందుకో తత్తరపడుతోంది. ఇంట్లోకి తీసుకెళ్ళి తన గదిలో కుర్చీమీద కూచోబెట్టి "లలితా ! పిన్ని నడిగి కాఫీ తీసుకురా" అని కేక వేశాడు. నాది ఇతరులని వెంటనే శంకించే స్వభావం కాదు. అందుకని పిన్ని అంటే ఎవరైనా చుట్టాలేమో అనుకున్నాను. ఇంతలో జానకిరామయ్య అందుకున్నాడు—"నీ ఎడ్రసు తెలియలేదు. ఎవర్ని పిలిచినా ఎవర్ని పిలవకపోయినా నిన్ను తప్పకుండా పిలుద్దా మనుకున్నాను."

ఈ మాట నాకు చురుక్కున తగిలింది. ఇందాకటినుంచీ నేను దూరంగా నెట్టివేసిన అనుమానాలన్నీ ఒక్క సారిగా మనసులో ముసురుకుంటున్నయ్. ఇన్నేళ్ళనుంచీ జానకిరామయ్యగారిని గురించి నామన

సులో చిత్రించుకున్న ఊహాచిత్రం ఒక్కసారిగా రంగులన్నీ మాయమైపోయి వికృతంగా వెలవెలబోతున్నట్లు అనిపించింది.

కాఫీ వొచ్చింది. తెచ్చింది లలిత కాదు. ఇందాకా నేను గుమ్మంలో చూసిన యువతి తెచ్చింది. ఎంత ప్రయత్నించినా కాఫీకప్పు ఖాళీ చెయ్యలేకపోయాను. ఎంతో పరాభవానికీ, మోసానికీ గురిఅయినట్లుగా నా మనస్సు "పద, ఇక్కడినుంచి పదా" అని తొందరచేస్తోంది. కూచున్నంతసేపూ ముళ్లమీద కూచున్నట్లుంది. జానకిరామయ్యమాత్రం గ్రామఫోను రికార్డులాగా ఈ ఆరేళ్ళ సంగతులూ ఏకరువు పెడుతున్నాడు.

ఈమెపేరుకూడా జానకేనట. ఈమె కళ్ళలో తన మొదటిభార్యపోలిక వుందట. ఈమెని పెళ్లాడమని తన మొదటిభార్యే బతిమాలిన ట్లనిపించిందట. ఈమె పిల్లలని తన పిల్లల్లాగ చూస్తానందట. తను పిల్లలకోసమేనట ఈ పెళ్లికి వొప్పుకుంది.

ఇంకా ఇదే ధోరణిలో తన రెండో పెళ్లిని సమర్థించుకుంటూ చెప్పుకుపోతున్నాడు. ఎందుకీ వృథా ప్రయాస? తను చేసిన పని తప్పని ఎవరైనా అంటే కదా కాదని తను సమర్థించుకోటానికి. అందులో ఇటువంటి కుంటి సమర్థనలు ఎందరిదగ్గిరో వినివుండటంవల్ల నాకు మరీ చిరాకుగా వుంది. ఇక ఆయనమాటల జడివానకి అంతు కనబడేట్లు లేదని మధ్యలో లేచి "వెళ్ళొస్తా" అని నిలబడ్డాను.

"అయ్యో, అదేమిటీ? రాకరాక ఆరేళ్లకి వచ్చి అప్పుడే వెళ్తానంటమేమిటి? వీల్లేదు; వీల్లేదు" అని బలవంతాన మళ్లీ నన్ను కుర్చీలో కూచోబెట్టాడు.

ఎలెక్ట్రిక్ ఫాన్ లేని సినిమాహాల్లో మాటినీ చూస్తున్న ప్రేక్షకుడిలా గుంది నా అవస్థ. మళ్లీ లేచి "నేను ఇంకా చూసుకోవలసిన పను లున్నయ్. సాయంత్రం రైలుకి ప్రయాణం. వ్యవధి లేదు. వెళ్లొస్తా" అన్నాను.

"అయితే వెళ్లటమేనా? మాయింట్లో ఒక పూటైనా భోజనం చెయ్యవా?"

"ఆఁ. భోజనానికేం లెండి. ఈసారి వొచ్చినప్పుడు చెయ్యనా?...మరి శెలవిస్తారా?"

"సరే, అంత కాదుకూడ దంటే బలవంతాన ఆపుతానా? వెళ్లి రా నాయనా. మరి అంతా విన్నావు కాని నీ అభిప్రాయ మేమిటో చెప్పావు కావు." అన్నాడు ఎంతో కుతూహలంతో.

నాకు అరికాలిమంట నెత్తికెక్కింది. "ఇది వ్యక్తిగతమైన విషయం. ఇందులో ఇతరుల అభిప్రాయాల ప్రసక్తి ఏముంది? మీకు తోచిన పని మీరు చేశారు. అది మంచో, చెడ్డో నిర్ణయించటానికి నాకేం అధికార ముంది? శెలవిస్తారా?" అని రెండడుగులు వేశాను.

"మంచిది. వెళ్లి రా నాయనా. ఈసారి మావూరొస్తే మాత్రం మాయింట్లోనే దిగాలి, తెలిసిందా?" అన్నాడు.

సమాధానంగా తల వూపి ముందుకి నడిచాను. వెనకనుంచి ఆయన మళ్లీ కేకేసి "నాయనా, చెప్పటం మరిచాను. నేను నా సొంతకథని నవలగా రాశాను. దానికి జానకిపేరే పెట్టాను. అచ్చు పూర్తికాగానే నీకో కాపీ పంపిస్తాను" అన్నాడు.

"సరే, మంచిది" అని గబగబా వెళ్లిపోయాను. దారిపొడుగునా తల తిరిగిపోయింది. మరణసమయంలో పెళ్లానికి చేతిలో చెయ్యి వేసి రెండోపెళ్లి చేసుకోనని శపథం చేసిన పెద్దమనిషేనా ఈయన? అనవసరంగా ఈయన్నిగురించి ఎన్ని ఊహించాను, ఎంత పొగుడుకున్నాను! చివరికి జీవితంలో అమాంతం ఎంత పల్టీ కొట్టాడు! అందుకోలేని ఆదర్శాలకోసం పాకులాడటం ఎందుకూకీ బోల్తా కొట్టటం ఎందుకూ?

అయినా నాదే తప్పు. మానవమాత్రుడైన జానకిరామయ్య మానవాతీతుడై 'త్యాగమూర్తిగా, ఆదర్శప్రాయుడుగా మారిపోతాడని ఆశపడటం నాదే తప్పు. ముమ్మాటికీ నాదే తప్పు.

---